




ఖిల్లా రాఘునాథ రామాలయంలో..

ఖిల్లా డిచ్‌పల్లి రామాలయంలో..

ఖిల్లా రఘునాథ ఆలయంలో ట్రాన్స్‌జెండర్ల వివాహాలు

కల్యాణం.. కమనీయం


- వైభవంగా సీతారాముల కల్యాణం
- రామనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు
- సీతారామచంద్రుడికి నీరాజనాలు పలికిన భక్తులు
- ఆలయాల్లో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు
- జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటిన శ్రీరామ నవమి వేడుకలు

(మరిన్ని వివరాలు 6,7వ పేజీలల్లో...)

జిల్లా వ్యాప్తంగా ఆదివారం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించి తరించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, శ్రీ రామనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. జిల్లా కేంద్రంలోని ఖిల్లా రఘునాథ ఆలయంలో నిర్వహించిన కల్యాణంలో ఉత్తరఖండ్ గంగోత్రి రామానుజదాస స్వామి కల్యాణ వేడు కలను జరిపించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్త వేడుకల్లో పూజలు చేశారు. సుభాష్‌నగర్ రామాల యం కల్యాణ వేడుకల్లో జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల, పోలీసు కమిషనర్ సాయిచైతన్య పాల్గొని పూజలు చేశారు. అదేవిధంగా అయోధ్య రామాలయం, వినాయక్‌నగర్‌లోని సంకటమోచన హనుమాన్ ఆలయం, వర్నిరోడ్‌లోని వాల్మీకి రామాలయం, సద్గురు దత్త ఆశ్రమంలో రాములవారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం, పోచంపాడ్ కోదండరామాలయం, గుండారం రామాలయం, బబాలహనుమాన్, శక్కర్‌నగర్ రామాలయం, సుభాష్‌నగర్ రామాలయం, ఆర్మూర్, బోధన్‌లోని రామాలయాల్లో కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

\- న్యూస్ నెట్‌వర్క్, నిజామాబాద్




సుభాష్‌నగర్ రామాలయంలో..

సిరికొండ రామడుగులో..

ఆర్మూర్ నవనాథ సిద్దుల గుట్టపై..

బోధన్ శక్కర్‌నగర్ శ్రీరామాలయంలో..


టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకున్న సన్న బియ్యం

వక్రమార్గం

పక్కదారి పడుతున్న సబ్సిడీ సన్న బియ్యం

- వరుసగా పట్టుబడుతున్న పీడీఎస్ బియ్యం
- ఒకే పోలీసు స్టేషన్ పరిధిలో రెండు సార్లు నిల్వల గుర్తింపు

ఖిల్లా, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న సన్న బియ్యం పక్కదారి పడుతోంది. జిల్లా కేంద్రంలోని ఓ ప్రధాన పోలీసు స్టేషన్ పరిధిలో నాలుగు రోజుల్లో వేర్వేరు చోట్ల అక్రమంగా నిలువ ఉంచి రవాణా చేయడానికి సిద్ధంగా ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకుంది. పేదల బియ్యం అక్రమ రవాణాపై సీరియస్‌గా ఉన్న పోలీసు కమిషనర్ సాయిచైతన్య ఆ దిశగా దృష్టి సారించారు. పేదల బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్ఠ నిఘా పెట్టారు. టాస్క్‌ఫోర్స్ బృందంతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నారు. ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ఆదివారం పేదలకు గతంలో ఉన్న బియ్యం స్థానంలో సన్న బియ్యాన్ని పంపిణీ చేసింది. అయితే సన్నాల పంపిణీ మొదలై వారం రోజులు కాకముందే అక్రమార్కులు వాటిని రేషన్ షాపుల నుంచి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేయడానికి నిలువ ఉంచారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రధాన పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోని అశోక్‌నగర్, ఎరుకలవాడలో బియ్యాన్ని నిలువ ఉంచినా వాటిని సంబంధిత పోలీసులు గుర్తించలేకపోయారు. సన్నాలు ప్రారంభమైన నాలుగు రోజుల్లోనే ఒకే పోలీసు స్టేషన్ పరిధిలో రెండు సార్లు టాస్క్‌ఫోర్స్ బృందం అక్రమంగా నిలువ ఉంచిన పీడీఎస్ బియ్యం గోదాములపై దాడులు చేసి సుమారు 1లక్షల రూపాలయ విలువ చేసే పేదల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కానీ అసలు సూత్రధారులను పట్టుకోక పోగ వారి వద్ద పనులు చేసే అమాయకులను పట్టుకుని కేసులు నమోదు చేశారు. కాగా, సదరు పోలీసు స్టేషన్ పరిధిలో పీడీఎస్ బియ్యం అక్రమ నిలువతో పాటు పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో మట్కా, పేకాట, గంజాయి, గుట్కా వంటి నిషేధిత వ్యాపారాలు యథేచ్ఛగా జరుగుతున్నా సంబంధిత పోలీసులు వారిని పట్టుకోక పోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.



మంత్రివర్గ విస్తరణపై ఉత్కంఠ

- రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఆలస్యమవుతుండటంతో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతల్లో పెరుగుతున్న టెన్షన్
- ఉమ్మడి జిల్లాకు మంత్రి లేక కుంటుపడుతున్న అభివృద్ధి పనులు
- రెండో విడతలో అవకాశం ఇవ్వాలని కోరుతున్న పార్టీ నేతలు

నిజామాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఆలస్యం అవుతుండటంతో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతల్లో ఉత్కంఠ పెరుగుతోంది. కొత్తగా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఉమ్మడి జిల్లాకు మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం వస్తుందని ఎదురు చూసినా అవకాశం దక్కలేదు. రాష్ట్ర స్థాయిలో సామాజిక సమీకరణాలను బట్టి రెండో విడతలో అవకాశం వస్తుందని భావిస్తున్న ప్రతిసారి విస్తరణ వాయిదాపడు తుండటంతో పార్టీ నేతలు నిరాశకు గురవుతున్నారు. మంత్రి లేకపోవడం వల్ల క్యాడర్ కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో తమ సమస్యలను చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 16 నెలలుగా మంత్రి లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. నిధుల విడుదలతో పాటు పనుల పర్యవేక్షణ చేసేవారు లేకపోవడం వల్ల నష్టం జరుగుతోంది. రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ చైర్మన్‌లతో పాటు సలహాదారుల పదవులు ఎక్కువ గానే వచ్చినా ఫలితం మాత్రం లేదు. ఉమ్మడి జిల్లా పరిధిలో మంత్రి ఉంటే పెద్ద దిక్కుగా ఉండటంతో పాటు క్యాడర్‌ను బలోపేతం చేయడంతో పాటు సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తున్న ఆలస్యమవుతుండటంతో పార్టీ నేతల్లో అసహనం పెరుగుతోంది.

మంత్రివర్గంలో దక్కని చోటు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడుస్తున్నా ఉమ్మడి జిల్లా నుంచి మంత్రివర్గంలో ఎమ్మెల్యేలకు అవకాశం రాలేదు. రాష్ట్రస్థాయిలో సామాజిక సమీకరణాలను బట్టి మొదటి విడతలో మంత్రి పదవులను భర్తీ చేసిన ఆరు పదవులను ఖాళీగా ఉంచారు. ఉమ్మడి జిల్లా నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో నలుగురు ఎమ్మెల్యేలు గెలిచారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రస్తుతం కాంగ్రెస్‌కే ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఉన్నా మంత్రి వర్గంలో అవకాశం దక్కలేదు. ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవుల్లో ఎనిమిది మందికి అవకాశం వచ్చింది. వీరితో పాటు ఇద్దరికి రాష్ట్ర సలహాదారులుగా అవకాశం ఇచ్చారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ జిల్లా నుంచే ఉండగా ఆయనకు మొదటి విడతలో ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో పార్టీ బలం పుంజుకున్నా మంత్రి పదవి లేకపోవడంతో ఆ ప్రభావం కనిపిస్తుంది. ఉమ్మడి జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా జూపల్లి కృష్ణారావు ఉన్నా పూర్తి స్థాయిలో పర్యవేక్షించడం లేదు. కొన్ని కార్యక్రమాలకు మాత్రమే ఆయన హాజరవుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేలు వారి పరిధిలోనే కార్యక్రమాలను పర్యవే క్షిస్తున్నా ఉమ్మడి జిల్లా స్థాయిలో సమీక్షించేవారు లేకపోవడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి.

మొదటి నుంచి తెరపైకి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేరు

ఉమ్మడి జిల్లా నుంచి మంత్రివర్గంలో అవకాశం వస్తుందని మొదటి నుంచి బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి పేరు వస్తుంది. ఆయనకే అవకాశం ఉంటుందని కీలక నేతలందరూ ప్రకటించారు. మిగతా ముగ్గురు ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, మదన్ మోహన్‌రావు, లక్ష్మీకాంత్‌రావు, కొత్తవారు కావడం వల్ల వారికి ఇతర పదవుల్లో అవకాశం ఇవ్వనున్నట్లు పార్టీ నేతల సమాచారం బట్టి తెలుస్తోంది. గతంలో మంత్రిగా పనిచేయడంతో పాటు నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సుదర్శన్‌రెడ్డికి అవకాశం వస్తుందని ఉమ్మడి జిల్లా నేతలు ఆశగా ఎదురు చూస్తున్నారు. కొన్ని అభివృద్ధి కార్యక్రమాలన్నీ ఆయన ఆధ్వర్యంలోనే కొనసాగుతున్నాయి. రాష్ట్ర మంత్రి వర్గంలో ఆరు ఖాళీలు ఉండటం వల్ల ఉమ్మడి జిల్లా నుంచి సీనియర్‌గా ఉన్న మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ఇవ్వాలని పార్టీ శ్రేణులు కోరుతున్నారు. కాగా, ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి దక్కితే పలు అభివృద్ధి పనులు ఊపందుకునే అవకా టశాలు ఉన్నాయి.



నూతన ఓటరు నమోదు ప్రక్రియ షురూ

- జిల్లాలో 14లక్షల 36వేల 42 మంది ఓటర్లు
- మహిళా ఓటర్లదే పైచేయి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమానికి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 1 వరకు 18 ఏళ్ల నిండిన వారికి ఓటు హక్కు నమోదుకు అవకాశం కల్పిస్తు న్నారు. గతంలో ఏడాదికి ఒకసారి మాత్రమే జనవరి లో కొత్త ఓటరు నమోదుకు అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు ఏడాదిలో నాలుగుసార్లు కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించనుంది. ఈ క్రమంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలో పోటీ చేసే అభ్యర్థులు కొత్త ఓటర్లను నమోదు చేయించేందుకు ఆసక్తిని చూపుతున్నారు. ముఖ్యంగా వార్డులు, డివిజన్ స్థాయిలో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు కొత్త ఓటర్ల నమోదును చేయిస్తున్నారు. కొత్త ఓటర్ల నమోదు వల్ల తమకు లాభంచేకూరుతుంద ని దానిని తమకు అనుకూలంగా మార్చుకునేం దుకు ఆశావహులు ఓటర్ల నమోదుపై దృష్టిపెట్టారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా గత జనవరిలో ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 14లక్షల 36వేల 42 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లలో మహిళా ఓటర్లు 7లక్షల 58వేల 5 మంది ఉండగా, పురుష ఓటర్లు 6లక్షల 77వేల 130 మంది ఉన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో మొత్తం 2లక్షల 14వేల 266 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుష ఓటర్లు 99వేల 657 మంది, మహిళా ఓటర్లు 1లక్షా 14వేల 473 మంది ఉన్నారు. బోధన్ నియో జకవర్గంలో మొత్తం 2లక్షల 24వేల 941 మంది ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు 1లక్షా 6వేల 999 మంది, మహిళా ఓటర్లు 1 లక్షా 17వేల 768 మంది ఉన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో మొత్తం ఓట ర్లు లక్షా 98వేల 939 మంది ఉండగా ఇందులో పురుష ఓటర్లు 94వేల 557 మంది, మహిళా ఓటర్లు లక్షా 4వేల 145 మంది ఉన్నారు. నిజామాబాద్ అర్బన్‌లో మొత్తం ఓటర్లు 3లక్షల 7వేల 524 మంది ఉండగా పురుష ఓటర్లు లక్షా 48వేల 162 మంది, మహిళా ఓటర్లు లక్షా 59వేల 225 మంది ఉన్నారు. నిజామాబాద్ రూరల్‌లో మొత్తం ఓటర్లు 2లక్షల 60వేల 676 మంది ఉండగా, పురుషులు ఒకలక్షా 21వేల 627 మంది, మహిళా ఓటర్లు ఒకలక్షా 38వేల 852 మంది ఉన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2లక్షల 29వేల 696 మంది ఉండగా పురుషులు లక్షా 6వేల 108 మంది, మహిళా ఓటర్లు లక్షా 23వేల 512 మంది ఉన్నారు.

ఏడాదికి నాలుగుసార్లు నమోదుకు అవకాశం

గతంలో నూతన ఓటర్ల నమోదుకు ప్రతీ సంవత్సరం జనవరిలోనే అవకాశం ఇచ్చేవారు. ప్రస్తుతం నాలుగుసార్లు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం కల్పిస్తున్నారు. జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో ఓటరు నమోదుకు అవకాశం కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఏప్రిల్‌కు సంబంధించి కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం కల్పిస్తున్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి నుంచి సూచనలు స్వీకరించి ఓటర్ల నమోదుకు ఓటర్లలో అవగాహన కల్పించనున్నారు.

యువతే కీలకం

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత ఓట్లే కీలకంగా రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం సిద్ధమవుతున్న ఆశావహులు యువతను ఓటర్లుగా మార్చుకునే అవకాశం ఉండటంతో వారి ఓట్లను నమోదు చేసే అంశంపై దృష్టి పెట్టారు. ప్రస్తుతం జిల్లాలో మహిళల ఓట్లే ఎక్కువగా ఉండగా నూతనంగా కొత్త ఓట్లు కూడా ఎక్కువగా యువతులే నమోదు చేసుకునే అవకాశం ఉంది.

జిల్లా అంతటా ఘనంగా సీతారాముల కల్యాణం



బోధన్ సీతారాముల కల్యాణంలో పూజలు నిర్వహిస్తున్న ఏసీపీ



అంజుమాన్ ఫారంలో..



కోటగిరిలో...



మోస్రాలో..



ధర్పల్లిలో..



భీమ్‌గల్‌లో సీతారాముల కల్యాణం దృశ్యం



పెద్ద రాంమందిర్‌లో డోలారోహణం చేస్తున్న దృశ్యం



నగరంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): బోధన్‌లో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బోధన్ పట్టణంతో పాటు సాలూర, బోధన్ మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న రామాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లో గల రామాలయంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే భక్తులు బారులు తీరారు. ఉదయం నుండి ఆలయాల్లో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ స్వాములు, గురుస్వాములు హనుమాన్ చాలీసా పారాయణంతో జై శ్రీరామ్ నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. సీతారాముల కల్యాణాన్ని చూడడానికి చుట్టు పక్కల గ్రామాల నుండి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. సీతారాముల కల్యాణాన్ని బోధన్ ఏసీపీ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల కల్యాణ మహోత్సవంలో పట్టణ ప్రముఖులు, మాజీ ప్రజాప్రతినిధులు, సంబంధితశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్:మండలంతో పాటు వివిధ గ్రామాలలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ప్రజలు భక్తి శ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని రామాలయంతో పాటు , ఎస్టీ, బీసీ కాలనీలోని రామాలయంలో శ్రీరాముడి కల్యాణోత్సవాలను వైభవంగా జరుపు కున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు బారీ ఎత్తున పూజలు నిర్వహించారు.

డిచ్‌పల్లి:జిల్లాల్లో ప్రసిద్ది చెందిన ఖిల్లా రామాలయంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 11గంటలకు శ్రీరాముని జననంను పురోహితులు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సుమీత్ శర్మదేశ్‌పాండె ఆధ్వర్యంలో 12:01 గంటలకు శ్రీ సీతరాముల కల్యాణోత్సం నిర్వహించారు. ఈ వేడుకలకు రూరల్ ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డి- వినోదిని దంపతులు హాజరయ్యారు. ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్ గుప్తా కుటుంబ సభ్యులు స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పిం చారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ శాంతయ్య జంగం, నాయకులు సాయిరెడ్డి, అమృతపూర్ గంగాధర్, శేఖర్ గౌడ్, శ్రీనివాస్, వీడీసీ సభ్యులు సాయిలు, సుదర్శన్, మహేందర్‌రెడ్డి, రాములు,నర్సారెడ్డి, లక్ష్మణ్, గ్రామస్థులు పాల్గొన్నారు. చారిత్రాత్మక ఖిల్లా డిచ్‌పల్లి రామాలయానికి సీఎం రేవంత్‌రెడ్డిని త్వరలో తీసుకొస్తానని రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి అన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్, నాయకులు సుదర్శన్, శ్రీనివాస్, చైర్మన్ శాంతయ్య ఉన్నారు. శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని 34 గ్రామాల్లో ని రామాలయాలు జైశ్రీరామ్ అంటూ భక్తుల ఆధ్యాత్మిక గీతాలతో మారుమోగి పోయాయి. ధర్మారం(బి) వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ప్రతినిధి రావుల బ్రహ్మానందం ఆధ్వర్యంలో సీతరాముల కల్యాణం వేద పండితులు రాహుల్ త్రిపాఠి నిర్వహించారు.

ధర్పల్లి:మండలంలోని ఆయా రాముల వారి దేవాలయాల్లో సీతారాముల కళ్యాణోత్సవం కన్నుల పండుగగా ఆదివారం జరిగింది. మండల కేంద్రంలోగల రామాలయంలో ఆలయ కమిటీ, హనుమాన్ భక్తులు, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

మోస్రా: చందూర్, మోస్రా మండల కేంద్రాల్లో, అదే విధంగా మండలాల్లోని తిమ్మాపూర్, లక్ష్మాపూర్‌తో పాటు అన్ని గ్రామాల్లో శ్రీ రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి సీతారామచంద్రుల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా చందూర్ మండల కేంద్రంలో రామాలయం వద్ద పాఠశాల విద్యార్థులతో ఆడించిన ప్రత్యేక కోలాటం భక్తులందరిని ఆకట్టుకుంది. అనంతరం అన్నప్రసాదం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోస్రా మండల భక్తులు, చందూర్ మండల భక్తులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

భీమ్‌గల్:పట్టణ కేంద్రంలోని మోక్షనంద ఆశ్రమంలో సర్వ సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వర్ణాలంకరణ భూశితులైన శ్రీసీతారాముల దేవతామూర్తులను భక్తులు రామ రామ నామస్మరణలతో కళ్యాణ మండపం నందు ఆసీనులను చేసి అర్చకుల వేదమంత్రాలు భాజా భజంత్రీల నడుమ పురోహితులు మాంగళ్యధారణ గావించారు.ఈ కార్యక్రమంలో సర్వసమాజ్ కమిటీ అధ్యక్షుడు నీలం రవి, ఉపాధ్యక్షుడుమోహన్, కార్యదర్శి నవీన్; హారీష్, మూడు సంఘాల పెద్దమనుష్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్:పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యం ఆవరణలోని నాగలింగేశ్వరాలయంలో, రామ్‌నగర్‌లోని రామాలయంలో ఆదివారం శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలింగేశ్వరాలయంలో ఆలయ కమిటి ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించి సీతారాముల కళ్యాణాన్ని జరిపించి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి నాగలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగలింగేశ్వరాలయ ఆలయ కమిటి ప్రతినిధులు సత్యశ్రీనివాస్, రాజయ్య, రమణ, కలిగోట గంగాధర్, స్వామి, రెడ్డి ప్రకాష్, అంబిక రమేష్, బాలోజీ, నారాయణ, రాజేందర్ పాల్గొన్నారు.

రామ్‌నగర్‌లో:పట్టణంలోని రామ్‌నగర్‌లో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొక్కుల లింగం, గుద్దెటి రమేష్, గంగమోహన్ చక్రు, విఠోభ శేఖర్, కర్తన్ నవీన్, చరణ్, రాజు, ఈఆర్ ఫౌండేషన్ సభ్యులు అర్గుల్ సురేష్, రాంప్రసాద్, రాంచెందర్, ప్రమోద్, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండలంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని కోటగిరి, ఎత్తొండ, ఎక్లాస్‌పూర్, కొత్తపల్లి, అడ్కాస్‌పల్లి గ్రామాలలో రామాలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. ఆలయాల్లో భక్తులుపూజలు నిర్వహించారు. పొతంగల్ మండలంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని పలు గ్రామాల్లోని రామాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొతంగల్ రామాలయంలో శ్రీరామ జన్మదినం, సీతారాముల కల్యాణ మహోత్సవం, పల్లకి సేవ వంటి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రుద్రూరు మండలంలో ఆదివారం శ్రీరామ నవమి వేడు కలు ఘనంగా నిర్వహించారు. రుద్రూరు, రాయకూర్ క్యాంప్, సిద్దాపూర్ క్యాంప్, అక్బర్‌నగర్, సులేమాన్ నగర్, అంబం, లక్ష్మీపూర్ క్యాంప్ గ్రామాలలో శ్రీరామ నవమి వేడుకలు కన్నుల పండువగా సాగాయి. సులేమాన్ నగర్‌లో శ్రీరామ నవమిని పురస్కరించుకుని హనుమాన్ మాలధారులు ఆంజనేయ స్వామి ఆలయం నుంచి రామాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు.

జక్రాన్‌పల్లి:మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ప్రజలు, భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. కలిగోట్‌లో సీతారామాలయంలో సీతారాముల కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా కన్నుల పండుగగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలిగోట్ విడిసి సభ్యులు, ఆలయ కమిటి సభ్యులు , భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మెండోర:మండలంలోని పోచంపాడ్ శ్రీ కోదండ రామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకల్లో మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి దంపతులు స్వామివారికి నూతన వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ప్రశాంత్‌రెడ్డి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిరవహించి స్వామి వారి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ నాగంపేట్ శేఖర్, కమలాకర్, అనిల్ సాగర్‌రెడ్డి, సతీష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:కమ్మర్‌పల్లి మండ వ్యాప్తంగా ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని జంబిహనుమాన్ ఆలయంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవాం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొన్నారు.

మోపాల్: మోపాల్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం శ్రీరామ కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు నర్సింహారెడ్డి, విజయసింహారెడ్డి కుటుంబ సమేతంగా కల్యాణోత్స వంలో పాల్గొన్నారు. అలాగే మండలంలోని న్యాల్‌కల్, సిర్పూర్, బాడ్సి, బోర్గాం(పి), కంజర్, కులాస్‌పూర్ వీడీసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

నిజామాబాద్ కల్చరల్:శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో ఘనంగా వేడుకలు జరిపారు. ఆదివారం నగరంలోని ప్రసిద్ధిచెందిన పెద్ద రాంమందిర్‌లో భక్తులు రామునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఉయ్యాలలో రాముని ఉత్సవ విగ్రహాన్ని ఉంచి నామకరణం చేశారు.జిల్లా కేంద్రం లోని ఆర్యనగర్ రామాలయం, పోచంపాడ్ రామాలయం, బోధన్ శక్కర్‌నగర్ రామాలయం, పడిగల్ రామాలయం, కిసాన్‌నగర్ రామాలయం, కోటగిరి రామాలయం, ఆర్మూర్ రామాలయం, వర్ని రామాలయాల్లో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు.

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం పార్టీ జెండాను మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో , బీజేపీ నాయకులు గంగారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిరికొండ: శ్రీరామ నవమీ సందంర్భంగా సిరికొండ మండలంలోని రామడుగు,కొండూర్, సిరికొండ,గడ్కోల్,న్యావనంది గ్రామాల్లో గల ఆలాయాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగాజరుపుకున్నారు. సిరికొండలో గల శ్రీలొంకరామలింగేశ్వర స్వామి ఆలాయంలో సీతా రాముల కళ్యాణాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు.

మోపాల్: మాదవనగర్ సాయిబాబా ఆలయంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సాయిబాబా జన్మదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీరాముని కళ్యాణం కూడా అంగరంగ వైభవంగా సాయిబాబా ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు.

నవీపేట: మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నవీపేట, అంజుమాన్ ఫారం, కమలాపూర్, అభంగపట్నం, నిజాంపూర్, జన్నేపల్లి, నాగేపూర్, బినోల తదితర గ్రామాలలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముప్కాల్:మండలంలోని రెంజర్ల గ్రామంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని కోదండరామాలయంలో ఆదివారం సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ఆవరణలో కళ్యాణం కోసం ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై సీతారాముల కళ్యాణం బాజా భజంత్రీల మధ్య వైభవోపేతంగా నిర్వహించారు.

రెంజర్ల కోదండ రామ కళ్యాణంలో పాల్గొన్న ఈరవత్రి అనిల్ ...

రెంజర్ల కోదండ రాముని కళ్యాణోత్సవంలో టీజీఎండిసి చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు ప్రత్యేకంగా స్వాగతం పలికి శాలువ తో సత్కరించారు. అనంతరం సీతారామున్ని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు మద్దిరి ముత్యంరెడ్డి, చిన్నరెడ్డి, సంద రవి తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్: శ్రీరామ నవమి పురస్కరించుకొని ఆదివారం ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై ఆలయ కమిటి ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం కన్నుల పండుగగ నిర్వహించారు. వేద పండితులు గోపి శర్మ, సిద్దుల గుట్ట ఆస్థాన పండితులు కుమార శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారా ముల కళ్యాణంలో ఆర్మూర్, చుట్టు ప్రక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిజామాబాద్ పోలీస్ కమీషనర్ సాయి చైతన్య సీతారాములను దర్శించుకొని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రెంజల్: తండ్రి మాటను జవదాటని ఆదర్శమూర్తి శ్రీరాముడని, శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని తాడ్‌బిలోలి, నీలా, కందకుర్తి, రెంజల్, దూపల్లి, కళ్యాపూర్ గ్రామాలలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సాయిరెడ్డి, నర్సయ్య, శ్రీనివాస్, సుధాకర్, జగన్‌రెడ్డి, దత్తురెడ్డి, దత్తు పటేల్, గంగాధర్, అబ్బన్న, యోగేష్, నర్సారెడ్డి, అశోక్, ప్రవీణ్, పురోహితులు శ్రీనుపటేల్, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ కల్చరల్: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సారంగపూర్‌లోని హరిహరాత్మక బాలాక రామ్ రామానంద ఆశ్రమంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రంతోపాటు మండలంలోని పోచారం, జైతాపూర్, ఏఆర్పీ క్యాంపు, ఠానాకలాన్ గ్రామాలలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వర్ని: వర్ని మండలంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శ్రీరామ మందిరంలో శ్రీ సీతారామ కల్యాణం నిర్వహించారు.



శివాజీనగర్ రామాలయంలో పాల్గొన్న భక్తజనం



ఇందూరు తిరుమలలో మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకులు



శ్రీనగర్‌లో పూజలు చేస్తున్న రవీందర్‌రెడ్డి



పోచారం గ్రామంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



కోదండ రామాలయంలో అనిల్ కుమార్



కొండూర్‌లో ..



తాడ్‌బిలోలిలో..



కలిగోట్‌లో..

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఇందల్వాయి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్టేషన్ తండాలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఐకేపీ సువర్ణ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న కనీస మద్దతు ధర ఏగ్రేడ్ వరి ధాన్యానికి రూ.2320, బీగ్రేడ్ ధాన్యానికి రూ.2300 మద్దతు కల్పిస్తున్నామని అన్నారు. రైతులు వరిధాన్యాన్ని 17 శాతం తేమ కలిగిన వరి ధాన్యాన్ని తీసుకురావాలని రంగు మారిన ధాన్యం 5 శాతం ఉండేలా చూడాలని, బాగా ఎండబెట్టి నేచర్ వచ్చిన తర్వాతనే కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకురావాలన్నారు. పది పదిహేను రోజుల్లో రైతు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సువర్ణ, మాజీ సర్పంచ్ మోహన్ నాయక్, మాజీ ఎంపీటీసీ బాబురావు, వాల్యానాయక్, గ్రామ సంఘం అధ్యక్షురాలు అగ్గు లక్ష్మి, రాజ్యలక్ష్మి, కార్యదర్శులు వడ్ల శ్రావణి, దామ జ్యోతి, సీసీ ఉదయ్, రవినాయక్, జగత్‌నాయక్, వీవోఏలు మమత, సౌమ్య పాల్గొన్నారు.

నందిపేట : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు కోరారు. ఆదివారం మండలంలోని కంఠం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ పెంట ఇంద్రుడు మాట్లాడుతూ ఏ గ్రేడు(దొడ్డు రకం) వరిధాన్యం క్వింటాలుకు రూ.2,320, బి గ్రేడు(సన్న రకం) వరిధాన్యం క్వింటాలుకు రూ.2,300 ధర ప్రభుత్వం చెల్లింస్తుందని తెలిపారు.

దర్పల్లి: ఇటీవల కురిసిన వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ధర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని దుబ్బాక, ఎస్‌టీ తాండా, సీతాయిపేట్, గుడితాండా, గోవింద్‌పల్లి గ్రామాల్లో ఐకేపీ, సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అధైర్యపడవద్దని వడగండ్ల వాన, అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఇప్పటికే అధికారులు సర్వే నిర్వహించారని నష్టపరిహారం అందేవిధంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏగ్రేడ్ ధాన్యానికి రూ.2350, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2300, సన్నానికి 500 రూపాయల బోనస్ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు.

కందకుర్తిలో కుస్తీపోటీలు

రెంజల్,ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందకుర్తి గ్రామంలో ఆదివారం శ్రీరామ నవమిని పురస్కరించుకుని కుస్తీపోటీలను నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి సందర్భంగా గ్రామంలో కుస్తీపోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, ఈ సంవత్సరం కూడా కుస్తీపోటీలు నిర్వహించారు. కుస్తీపోటీలలో పాల్గొనేందుకు మల్లయోధులు భారీ సంఖ్యలో తరలివచ్చి కుస్తీపోటీలలో పాల్గొన్నారు. కుస్తీపోటీలలో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. చివరి విజేతలకు 10తులాల వెండి కడియాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కలీం బేగ్, మాజీ ఉప సర్పంచ్ యోగేష్, రమేష్, ఫెరోజ్, నాగభూషణం, సిరాజ్, గయాస్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

మోస్రా : మండలంలోని గోవూర్ గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా ఆనవాయితీగా కొనసాగుతున్న కుస్తీపోటీలు ప్రశాంతంగా ముగిశాయి. చుట్టు పక్కల గ్రామాల నుంచి మల్లయోధులు, మహరాష్ట్ర, కర్నాటక నుండి మల్లయోధులు పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు, సంఘం సభ్యులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోటగిరి :మండల కేంద్రంలోని వినాయక్ నగర్‌కాలనీలో ఆదివారం కుస్తీపోటీలు నిర్వహించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని గ్రామంలోని మీదిగల్లీ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీపోటీలు ఏర్పాటు చేశారు. కుస్తీపోటీలలో ప్రతిభను చాటేందుకు చుట్టు పక్కల మండలాల నుంచి పెద్ద ఎత్తున కుస్తీవీరులు తరలివచ్చి తమ ప్రతిభను చాటారు. పోటీలలో విజేతలకు నగదు బహుమతులను అందజేశారు

సైబర్ మోసంపై బాధితుడి ఫిర్యాదు

నవీపేట,ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన సైబా వెంకటేష్ 70 వేల రూపాయలను పోగొట్టుకున్నాడని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. మండల కేంద్రంలోని బాసర రోడ్డులో ఉన్న పెట్రోల్ బంక్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్న వెంకటేష్‌కు గత నెల 31న వాహనంలో డీజిల్ పోయగా 3370రూపాయలు తనకు ఫోన్‌పే ద్వారా కస్టమర్ పంపించాడు. ఈ నెల 1న డ్యూటీ ముగించుకునే సమయంలో సంబంధిత డబ్బులను తన యాజమానికి ఫోన్‌పే ద్వారా పంపించడానికి యత్నించగా డబ్బులు వెళ్లలేదు. దీంతో అతడు కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి వివరాలు అడిగాడు. కొద్దిసేపటి తర్వాత కస్టమర్ కేర్ నుంచి తాము మాట్లాడుతున్నామని ఫోన్ వచ్చిందని, తాము చెప్పిన విధంగా మీ ఫోన్ ఆపరేట్ చేస్తే డబ్బులు ఫోన్‌పే ద్వారా ట్రాన్స్‌ఫర్ అవుతాయని వివరించారు. దీంతో వెంకటేష్ అవతలి వ్యక్తులు చెప్పిన విధంగా తన ఫోన్‌ను ఆపరేట్ చేయగా తన బ్యాంకు ఖాతాలో ఉన్న 70వేల రూపాయలు ఖాళీ అయ్యాయని ఆయన వివరించారు. 2వేల రూపాయలు, 20వేల రూపాయలు, 48వేల రూపాయల చొప్పున మూడుసార్లు తమ ఖాతా నుంచి డబ్బులు ఖాళీ కావడంతో బాధితుడు సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశాడని, ఆదివారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించాడు. ఈ నెల 4న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'సైబర్ నేరగాళ్ల మోసంతో రూ.70వేలు ఖాళీ' అనే వార్తను ప్రచురించిన విషయం విదితమే.

చలివేంద్రం ప్రారంభం

బోధన్‌రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంగణంలో మర్వాడీ సమాజ్ ఆధ్వర్యంలో చలి వేంద్రాన్ని ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రతి సంవత్సరంలాగానే ఈ సంవత్సరం కూడా తాగునీటి సౌకర్యాన్ని కల్పించామని మర్వాడీ సమాజ్ నాయకులు తెలిపారు. మాజీ కౌన్సిలర్ దాము, మర్వాడీ సమాజ్ ప్రతినిధులు చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మర్వాడీ సమాజ్ ప్రతినిధులు తదితరులున్నారు.

వీడీసీ సభ్యులు, పురోహితుడిపై కేసు నమోదు

మోర్తాడ్ , ఏప్రిల్ 6(ఆంధ్ర జ్యోతి):ఏర్గట్ల మండలం తాళ్లరాం పూర్ గ్రామ కమిటీ సభ్యులపై, రామాలయ పూజారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని గ్రామం లోని కోదండ రామాలయంలో ఒకరోజు ముందు కుంకుమార్చణ జరగడం ఆనవాయితీ. దీంతో గౌడ సంఘానికి చెందిన మహిళలు శనివారం కుంకుమార్చనకు ఆలయం లోకి వెళ్లగా పూజారి గౌడ మహి ళల దగ్గరకు వెళ్ళి ఆలయం నుంచి బయటకు వెళ్ళాలని చెప్పారు. గ్రామ కమిటీ సభ్యులు మీరు ఆలయం వెళ్తేనే కుంకుమార్చన జరిపిస్తామని కరాకండిగా చెప్పడంతో చివరకు మహిళలు వెనుదిరిగారు. అయితే గ్రామంలో కొన్ని నెలల క్రితం గ్రామ కమిటీ సభ్యులు గీతాకార్మికులను బహిష్క రించారు. వీడీసీ కమిటీకి గౌడ సంఘం మధ్యన కొన్ని నెలల నుంచి వివాదం కొనసాగుతోంది. అయితే ఇటీవల వివాదం సద్దు మనిగిందని భావించిన గీతా కార్మికులు శ్రీరామనవమి ఉత్సవా లకు పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. మహిళలు కుంకుమార్చనకు వెళ్ళగా ఆలయం నుంచి వెళ్ళగొట్టడంతో మహిళలు అవమాన భారంతో ఏర్గట్ల పోలీస్ స్టేషన్‌కు తరలి వెళ్ళారు. పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించారు. దీంతో పోలీసులు స్పందించి గ్రామ కమిటీకి చెందిన ముగ్గురు సభ్యులపై, ఆలయ పూజారిపై కేసులు నమోదు చేశారు. జిల్లా స్థాయి గౌడ సంఘం నాయకులు ఈ సంఘటన పట్ల ఆదివారం స్థానిక గౌడ సంఘం నాయకులతో మాట్లాడారు. తదుపరి కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

'ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలి'

కోటగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం తలపెట్టిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. రుద్రూరు మండలంలోని చిక్కడ్‌పల్లి, రాణంపల్లి గ్రామాలలో ఆదివారం జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాలలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తోట అరుణ్, నాగేష్, మహబూబ్, నితిన్ పటేల్, రవి, చంటి, బాలరాజు, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.


బాన్సువాడ మండలంలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి


సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు


పోచంపాడ్‌లో సీతారాముల కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి దంపతులు

వైభవంగా సీతారాముల కల్యాణం

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఆదివారం శ్రీరామ నవమిని పురస్కరించుకొని వేద పండితుల మంత్రోశ్చరణలతో సీతారాముల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలకు కల్యాణ తంతును నిర్వహించారు. పలు ఆలయాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు శ్రీరామ నవమి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

● (ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)


మద్నూరులో రామచంద్రయ్య ఆలయ కమిటీ సభ్యులను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే


సుభాష్‌నగర్ రామాలయంలో పూజలు చేస్తున్న సీపీ సాయిచైతన్య


తాడ్వాయిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే


బాన్సువాడ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు


భిక్కనూరులో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


ఖిల్లా రామాలయంలో గంగోత్రి రామానుజదాసు, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్


సుభాష్‌నగర్ రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల

బలోపేతం కానున్న మహిళా సంఘాలు

● మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోళ్లలో ప్రాధాన్యత ● ప్రభుత్వ తీరుపై మహిళా సంఘాల హర్షం

● నియోజకవర్గంలో 103 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ● మహిళా సాధికారితకు న్యాయం

బోధన్‌రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక మహిళ సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం యాసంగి సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ ఐకేపీ సంఘాల ద్వారా 50శాతానికి పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయించాయి. మాజీమంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నియోజకవర్గంలో జరిగిన మహిళ సంఘాలను బలోపేతం చేస్తేనే కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని పలుమార్లు ప్రకటించారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం సగానికి పైగా కొనుగోలు కేంద్రాలను మహిళ సంఘాలకు కేటాయించారు. బోదన్ నియోజకవర్గంలో సుమారు 103 వరి కొనుగోలు కేంద్రాలు ఉండగా వీటిలో సగానికి పైగా 58వరి కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించారు. సుమారు 45కేంద్రాలను సహకార కేంద్రాలకు అప్పగించారు. దీంతో మహిళ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. సన్న ధాన్యానికి క్వింటాలుకు 500రూపాయల బోనస్‌ను దృష్టిలో పెట్టుకుని వానాకాలం సీజన్ నుండి దొడ్డు, సన్న రకం కొనుగోలు కేంద్రాలు వేర్వేరుగా నిర్వహించనున్నారు. దొడ్డు, సన్న రకం వరి ధాన్యాన్ని విడివిడిగా కొనుగోలు చేసి ట్యాబ్ ఎంట్రీ చేసి మిల్లులకు తరలించి రైతులు అధికారుల చుట్టూ తిరగకుండా వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయాల్సి ఉంది. రైతులు కూడా కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధరతో పాటు బోనస్‌ను పొందే అవకాశం ఉంది. నియోజకవర్గంలో మహిళ సంఘాలు ఈసారి దొడ్డు రకం, సన్న రకం వడ్లను కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధమయ్యారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఎండలు మండుతున్నందున మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో వరికోతలు ప్రారంభమయ్యాయి. ధాన్యం కొనుగోలుకు కావాల్సిన హమాలీలు తేమను కొలిచే, తూకం వేసే యంత్రాలతో పాటు అవసరమైన సామాగ్రిని మహిళా సంఘాలు సమకూర్చుకుని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరిస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఈసారి బోనస్‌ను దృష్టిలో పెట్టుకుని యాసంగి సీజన్‌లో నియోజకవర్గంలోని వేల ఎకరాలలో సన్నరకం వరి ధాన్యాన్ని గణనీయంగా రైతులు సాగు చేశారు. ప్రతీ రైతు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఆశ్రయించనున్నారు. కాబట్టి అనుభవం లేని మహిళా సంఘాల వారు ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించి విజయవంతం అవ్వడానికి కృషి చేస్తున్నారు.

● సహకార సంఘాలకు కష్టకాలమేనా..!?

కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చే కమిషన్ డబ్బులతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు అభివృద్ధి పథంలో నడిచాయి. ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అభివృద్ధికి దూరం కానున్నాయి. వరి ధాన్యం


నవీపేటలో ఐకేపీ ద్వారా వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

కొనుగోలు కేంద్రాల ద్వారా నియోజకవర్గంలోని బోధన్, ఎడపల్లి, నవీపేట, రెంజల్ మండలాల్లో సహకార సంఘాలకు సుమారు కోటి రూపాయల వరకు ఆదాయం సమకూరేంది. ఇలా వచ్చే కమీషన్‌తో సిబ్బంది జీతభత్యాలతో పాటు గోదాములు, సంఘం నూతన భవనాలు నిర్మించుకుని ఫర్టిలైజర్, పురుగుల మందులను నిల్వ చేసుకునే వారు. కొనుగోలు కేంద్రాలను ఐకేపీ మహిళలకు అప్పగించడంతో ఆదాయ మార్గాలు లేక సొసైటీలకు కష్టకాలం రానుంది. మూడు సొసైటీల పరిధిలో సుమారు 15గోదాములను లక్షలు వెచ్చించి ఫర్టిలైజర్ నిల్వ చేసుకోవడానికి నిర్మించారు.

● మహిళా సాధికారత కోసం

ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మహిళా సంఘాలకు, సొసైటీలకు క్వింటాలుకు సుమారు 32 రూపాయల కమీషన్ వస్తుండడంతో అభివృద్ధి బాటలో కొనసాగుతున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సీజన్‌కు కోటి రూపాయల వరకు ఆదాయం ఆర్జిస్తున్నాయి. పాలక వర్గానిదే పూర్తి బాధ్యత కావడంతో స్వలాభం కోసం కొన్ని సహకార సంఘాలు వ్యాపారుల పేరుతో అవసరం లేకున్నా గోదాములు, ఇతరత్రా అవకతవకలకు పాల్పడడం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దృష్టికి రావడంతో ఆయన ప్రత్యేకంగా మహిళా సంఘాలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో సగానికి పైగా ఐకేపీ సంఘాలకు బాధ్యతలు అప్పగించడంతో మహిళా సంఘాలు లక్షల్లో ఆదాయం పొంది ఎక్కువ అభివృద్ధి చెందనుండడంతో మహిళా సంఘాలు ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

మహిళ సంఘాల మహిళలు ఆర్థికంగా అన్ని రంగాలలో రాణించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం లాభదాయకమైన ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను మహిళలకు అప్పజెప్పుతుంది. మహిళ సాధికారత కొరకే ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుంది.

తొర్లికొండలో వేంకటేశ్వర స్వామి రథోత్సవం

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో ఆదివారం వేంకటేశ్వర స్వామి దేవాలయం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. రథోత్సవాన్ని గ్రామంలో ఊరేగింపుగా నిర్వహించారు. భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుల తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సంజీవ్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, విడిసి సభ్యులు, భక్తులు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆర్య సమాజ్‌లో యజ్ఞం

బోధన్‌రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని దయానంద ఆర్య సమాజ్‌లో శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం యజ్ఞ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని, యజ్ఞ మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని గోశాల కమిటీ నిర్వాహకులు ప్రదీప్ గుప్తా, యోగా మాధవి, లడ్డు శ్రీనివాస్ పేర్కొన్నారు.


బోధన్ గోశాలలో యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

హనుమాన్ స్వాములకు వంట పాత్రలు వితరణ చేసిన మైనారిటీ నాయకులు

కోటగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని హంగర్గ గ్రామంలో ఆదివారం హనుమాన్ స్వాముల మాలధారులకు ప్రముఖ సామాజిక సేవకర్త, మైనారిటీ ఎంఏ హకీం వంట పాత్రలు అందించారు. సుమారు 25వేల విలువ కలిగిన వంటపాత్రలు అందించి మతసామరస్యాన్ని చాటారు. ఈ సందర్భంగా హనుమాన్ స్వాములు ఆయనను ఘనంగా సన్మానించారు. గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ పునర్ నిర్మాణానికి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నీరడి గంగాధర్ 51వేల రూపాయల చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ మాలధారులు తదితరులు పాల్గొన్నారు.


హంగర్గలో మైనారిటీ నాయకుడిని సన్మానిస్తున్న హనుమాన్ స్వాములు



కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.


ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ



కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు


టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు


కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు


రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

నవోదయ ఫలితాలలో ఇందూర్ స్కూల్ విద్యార్థులు



ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

బోధన్‌రూరల్, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): జిల్లా నవోదయ ప్రవేశ పరీక్షలో దాదాపు సుమారు 1500మంది విద్యార్థులు పరీక్షలు రాయగా జిల్లాలో 9వ తరగతిలో 17సీట్లు ఉండగా అందులో ఐదుగురు ఇందూర్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభకనబర్చి ఎంపికకావడం గర్వకారణమని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. నవోదయలో ఎంపికైన బోధన్ ఇందూర్ హైస్కూల్ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువులో రాణించి సాంకేతికంగా అన్ని రంగాలలో మంచి ఫలితాలు సాధించి బోధన్, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు ఓడాలి కిషోర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, పులి శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ కిషోర్ పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణంలో ట్రాన్స్‌జెండర్ల వివాహాలు



రామాలయంలో ట్రాన్స్‌జెండర్ల పెళ్లి దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జగత్ ప్రసిద్ధిచెందిన సీతారాములవారి కల్యాణోత్సవంలో మేము స్వామిలాగానే వివాహం చేసుకుంటా మని ట్రాన్స్‌జెండర్లు వివాహం చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఖిల్లా రఘునాథ ఆలయంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో పలువురు ట్రాన్స్‌జెండర్లు వివాహ వేడుకలను తిలకించి పెళ్లిళ్లు చేసుకున్నారు. పండితులు సీతారాముల కల్యాణంతో పాటు వారి కల్యాణం కూడా నిర్వహించుకోవడంతో భక్తులు హర్షధ్వానాలతో ఆశీర్వచనం అందజేశారు. ఏటేటా ట్రాన్స్‌జెండర్ల వివాహం చేసుకోవడంతో అక్కడున్న వారంతా సంభ్రమాశ్చర్యంలో మునిగిపోయారు.

బోనస్ కుంభకోణం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

● కోటగిరిలో కాంగ్రెస్ నాయకుల ప్రెస్‌మీట్



కోటగిరిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యలమంచిలి

కోటగిరి, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): కోటగిరి సహకార సంఘంలో రైతులు పేరిట దాన్యం బోనస్ కుంభకోణం చేసిన ఎమ్మెల్యే పోచారంపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఉద్యమిస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యలమంచిలి శ్రీనివాస్ రావు స్పష్టం చేశారు. కోటగిరి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రైతులు, సీపీఐ నాయకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు రైస్‌మిల్లర్లు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అనుచరులు కుమ్మక్కై బోనస్ కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో బోధన్ ఎమ్మెల్యే షకీల్, మాజీ డీసీసీబీ చైర్మన్ భాస్కర్ రెడ్డి కనుసన్నల్లో పెద్ద ఎత్తున ధాన్యం కుంభకోణం జరిగిందన్నారు. సీఎంఆర్ ధాన్యంలో 250కోట్ల రూపాయలు మిల్లర్లు బకాయిలు ఉన్నారని ఆయన వివరించారు. ఐదేళ్ల కిందట బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు ఎమ్మెల్యే అండ చూసుకుని బోనస్ కుంభకోణానికి పాల్పడడం సిగ్గుచేటన్నారు. కోటగిరి తాజా, మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్, మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, వెండి అధ్యక్షులు శ్రీనివాస్ సిద్దు, జీవంకే బ్రీడర్స్ రైస్‌మిల్లు యాజమాని జబ్బార్‌తో పాటు మరో ముగ్గురు మిల్లర్లు బోనస్ కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు బోనస్ ఇస్తే వారి స్థానంలో రైస్‌మిల్లర్లు, నాయకులు దోచుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేవిధంగా వ్యవహరించిన అక్రమార్కులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే పాలకవర్గంలో ఉండి ప్రతిపక్షంగా పోరాడుతామన్నారు. ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీకి చెడ్డ పేరు తీసుకువచ్చే పనులు కార్యకర్తలు, నాయకులు చేయకూడదని హితవు పలికారు. అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగాధర్ రావు దేశాయ్, నాయకులు కమలాకర్ రెడ్డి, వహీద్ హుస్సేన్, సలీం, సీపీఐ నాయకులు విఠల్ గౌడ్, మాజీ జడ్పీ కోఆప్షన్ మెంబర్ వలీమొద్దీన్‌తో పాటు పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్నేహ సొసైటీలో హీమోఫిలియాపై అవగాహన

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మారుతీనగర్‌లోగల స్నేహ సొసైటీలో హీమోఫీలియా సొసైటీ నిజామాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హీమోఫీలియా బాధితులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు ఇన్విటిగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీంద్రనాథ్ సూరి, విజయానంద్‌రావు, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ఇంటెస్ ఫౌండేషన్ ప్రతినిధులు కరుణాకర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్లకు, స్కావెంజర్లకు వేతనాలు చెల్లించాలి

ఖిల్లా, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు ప్రతి నెల ఒకటవ తేదిన వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు వై.ఓమయ్య అన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు, స్కావెంజర్ల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లు, స్కావెంజర్లకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా వేతనాలు నిర్ణయించి బడ్జెట్ కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు టి.చక్రపాణి, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్‌లు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా వై.ఓమయ్య, అధ్యక్షులుగా టి.చక్రపాణి, ఉపాధ్యక్షులుగా రాధ, ప్రశాంతి, ప్రధానకార్యదర్శిగా వసంత, కార్యదర్శిగా సోఫియా, ఉదయ లతో పాటు 19మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఆదర్శనగర్ పతంజాలి నూతన కమిటీ ఎన్నిక

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఆదర్శనగర్ పతంజలి యోగా కేంద్ర నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంస్థ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో పతంజలి యోగా కమిటీ జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న సమక్షంలో భారత స్వాభిమాన్ ట్రస్ట్ అధ్యక్షుడిగా గంగాకిషన్, పతంజలి యోగా సమితి అధ్యక్షుడిగా ఆనంద్, సహాయకారి కిడ్డి అశోక్, యువభారత్ అధ్యక్షుడిగా వంచరి యాదవ్, కిసాన్ సేవాసమితి అధ్యక్షుడిగా శ్రీహరి, కార్యదర్శిగా జవహర్‌లాల్, కోశాధికారిగా సుదర్శన్, మీడియా ఇంచార్జిగా సాయిబాబా, పతంజలి మహిళా అధ్యక్షురాలిగా గాయత్రీ, సహప్రభారి రెడ్డిగా అనురాధ ఎన్నికయ్యారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోటగిరి, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని కొల్లూర్ గ్రామంలో ఆదివారం రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు కోటగిరి ఎస్ఐ సందీప్ తెలిపారు. సుంకిని మంజీర నది నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. ట్రాక్టర్ యాజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఘనంగా బీజేపీ వ్యవస్థాపక దినం



రెంజల్‌లో జెండాను ఎగురవేస్తున్న మండల అధ్యక్షుడు గోపికృష్ణ



నందిపేటలో ..



ఆర్మూర్‌లో బీజేపీ జెండాను ఎగురవేసిన ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

రెంజల్, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం రెంజల్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపికృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గత 45ఏళ్ల అలుపెరుగని పోరాటం చేస్తూ దేశ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ దేశ అభివృద్ధికి శ్రమిస్తూ ప్రపంచంలో అతిపెద్ద రాజకీయ పార్టీగా ఆవిర్భవించిన బీజేపీ దేశంలో మూడోసారి అధికారం చేపట్టిందని పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద పార్టీగా ఏర్పడిన భారతీయ జనతా పార్టీ నరేంద్ర మోదీ, అమిత్ షా సారథ్యంలో విశ్వవ్యాప్తమైన మార్పులు తీసుకువచ్చి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషోర్, మేక సంతోష్, పోచయ్య పాల్గొన్నారు.

నందిపేట: 2029లో అటు కేంద్రంలోనూ, ఇటు తెలంగాణ రాష్ట్రంలోనూ భారతీయ జనతా పార్టీయే అధికారంలోకి వస్తుందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగ సురేష్ తెలిపారు. ఆదివారం నందిపేట మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ ఉత్సవాలు నిర్వహించారు. ముందుగా మండల అధ్యక్షులు పల్లె రాజు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగ సురేష్ మాట్లాడుతూ ఇటీవల ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగగా పంజాబ్ మినహా మిగతా పలు రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పి గంగాధర్ గౌడ్, గాండ్ల నర్సాగౌడ్, మండల నాయకులు నాగుల బోజన్న, ఆయిల్ రమేష్, శ్రీనివాస్ గౌడ్, కొండపురం బోజన్న, బాల్ శ్రీనివాస్, మంత్రి రాజలింగం పాల్గొన్నారు.

ధర్పల్లి: మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేశారు. నేటితో 45 సంవత్సరాలతో పార్టీ ఆవిర్భావ దినోత్సవం పూర్తయిందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, కర్క గంగారెడ్డి, పెద్ద బాలొడ్డి, మహేష్, నరేష్, రాజేశ్ ఖర్, రాజేందర్, నల్లపెంటయ్య, జ్ఞానేశ్వర్, రాము, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సిరికొండ: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిరికొండ మండలంలోని వివిధ గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులు పార్టీ పతకాన్ని ఎగురవేసి ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ జండాను మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి జండాను ఎగర వేశారు. ఈ కార్యక్రమం మండల పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు బాబురావు, రాజేందర్, జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, ఓబీసీ రాష్ట్ర నాయకులు రామస్వామి, బీజేవైఎం మండల అధ్యక్షుడు మధు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ప్రభాకర్, రంజిత్‌రెడ్డి, లింగాగౌడ్, బాల్యానరేష్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల పార్టీ అధ్యక్షుడు కర్ర చంద్రకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ జెండా ను ఎగురవేశారు. బీజేపీ అధికారంలో ఉండటే దేశానికి రక్షగా ఉంటుందని చంద్రకాంత్ అన్నారు. మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, మండల నాయకులు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. రాబోయే రోజులలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సరిన్, ఆనంద్, రాజేందర్ గౌడ్, శ్రీకాంత్, గంగాధర్, బూషణ్, రాము, పాల్గొన్నారు.

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలో పట్టణ శాఖ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలో పార్టీ జెండాను ఎగురవేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ యోగేశ్వర్, నర్సయ్య, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు బండారి లక్ష్మీగౌడ్, సంధ్య రాజ్, ప్రవీణ్, చిన్ని నర్సయ్య, నర్సయ్య యాదవ్, నరేందర్ గౌడ్, నవీన్, లింబాద్రి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోర్తాడ్: మోర్తాడ్‌లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం ఉదయం మండల కార్యాలయంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పుప్పాల నరేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు బోగ దేవేందర్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి ఎలేటి సాయన్న, బీజేపీ నాయకులు కోసం ప్రకాశ్, శివానంద్, గంగామోహన్, నర్సయ్య, దేవేందర్, సాగర్, శేఖర్, రాజారెడ్డి పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవాని కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో మండల బీజేపీ నాయకులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు రేంజర్ల గంగాధర్, చింత ప్రవీణ్‌కుమార్, దశరథ్, బలరాం, చారి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: రుద్రూరు మండల కేంద్రంలో ఆదివారం భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రశాంత్ గౌడ్, గజేందర్, సాయినాథ్, గణేష్, శివప్రసాద్, రామరాజు, మహిపాల్, శ్రీకాంత్, వినీత్, అనిల్, పాల్గొన్నారు.

మోపాల్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని బోర్గాం(పి), మంచిప్ప, మోపాల్, తదితర గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా మాజీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు తోట శాస్త్రి, దండు శ్రీకాంత్, గణేష్‌రెడ్డి, శివ శంకర్, రఘు ఆనంద్, సునీల్‌కుమార్, చంద్రకాంత్‌రెడ్డి, గంగాధర్, రాకేష్, గౌడ్, వెం కన్న, మంచిప్పలో యాత్ అధ్యక్షులు సాగర్‌లు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శశాంక్, రాజేష్‌తో పాటు కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆర్మూర్‌రూరల్: తెలంగాణ రాష్ట్రంలో రానున్నది బీజేపీ ప్రభుత్వమే అని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్, బొట్ల విజయ్, వీరభద్ర, పొల్సాని వేణు, ఆకుల శ్రీనివాస్, విజయ్ ఆనంద్, దొండి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఎడపల్లి మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు కోల ఇంద్రకరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కందగట్ల రాంచందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లెపూల శ్రీనివాస్, నాయకులు సాయి, కుసుం అరుణ్, నాయిని లక్ష్మణ్ గౌడ్, సంతోష్, రఘు, అమర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బీజేపీ నేతలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. అన్ని గ్రామాల్లో పార్టీ జెండాలను ఎగరవేసి కొబ్బరికాయలు కొట్టి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు నాయుడు రాజన్న, నాయిని సురేందర్ కుంట మోహన్‌రెడ్డి, కన్నెచిన్న, లక్ష్మీనారాయణ, శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, పూదరి మహేందర్, పెన్నలరాజేందర్, కుమ్మరిప్రశాంత్, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు ఘన స్వాగతం

భీమ్‌గల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదివారం మండలంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, పట్టణ కేంద్రంలోని బడా భీమ్‌గల్ చౌరస్తా వద్ద భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. భీమ్‌గల్ ప్రాంతానికి చెందిన మహేష్‌కుమార్ గౌడ్ పీసీసీ అధికార హోదాలో తొలిసారి వస్తున్న సందర్భంగా మండల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ అధ్యక్షులుస్వామి, నర్సయ్య, ఎస్సీ,ఎస్సెల్ సెల్ అధ్యక్షులు అనంత్ రావు, గోపాల్ నాయక్, కుంట రమేష్, నాగేంద్ర, కన్నె సురేందర్, మల్లెల లక్ష్మణ్, వాకమహేష్, సుంకరినరేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ్ సిద్దుల గుట్టను ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ తన సతీమణితో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ దంపతులు రామాలయంలో, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాలో మారు దేవాలయాలను పర్యాటక శాఖ గుర్తించిందని రానున్న రోజుల్లో పర్యాటక శాఖ ప్రభుత్వం ద్వారా దేవాలయ అభివృద్ధికి చేపడతామని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వినయ్‌కుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, పండిత్ పవన్, గడ్డం రాజేశ్, కొంతం మురళి, జిమ్మి రవి ఉన్నారు.

భీమ్‌గల్ రూరల్: లొద్ది రామన్న ఆలయానికి అన్ని హంగులతో అభివృద్ధి చేసి తెలంగాణ రాష్ట్రంలోనే ఈ ఆలయానికి ప్రత్యేక గుర్తింపు వచ్చేలా కృషి చేస్తానని తెలంగాణ కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా ఆయన మండలంలోని పిప్రి గ్రామంలో ఉన్న లొద్ది రామన్న ఆలయంలో సీతారాముల కళ్యాణోత్సవానికి కుటుంబ సమేతంగా విచ్చేశారు. సీతారాముల కళ్యాణానికి తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ స్వగామమైన రహత్ నగర్, పిప్రి గ్రామాల మధ్య ఈ ఆలయం ఉందని, ఈ ఆలయాన్ని 1969 సంవత్సరంలో తన తండ్రి బొమ్మ గంగాధర్ గౌడ్ నిర్మించారని, తర్వాత పిప్రి గ్రామస్తులు ఈ ఆలయాన్ని అభివృద్ధి చేశారన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ఆలయానికి తనవంతు కృషి చేస్తూ సేవలు చేస్తున్నానని తెలిపారు. తన తండ్రి నిర్మించిన గుడిలో టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో వచ్చి ఈ కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొనడం తన అదృష్టమని ఇందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్‌కుమార్, మినరల్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్, బాల్కొండ నియోజకవర్గంలోని మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిజామాబాద్ అర్బన్: బాల్కొండ నియోజకవర్గంలోని భీంగల్ మండల లొద్ది రామన్న మందిరానికి 2లక్షల రూపాయల విరాళాన్ని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అందజేశారు. ఆదివారం రామన్న మందిర కమ్యూనిటీ హాల్, డబుల్ రోడ్డు కొరకు ఆయన హామీ ఇచ్చారు. తన తండ్రి గంగాధర్‌గౌడ్ నిర్మించిన కాళీమాత, లలితామాత ఆలయానికి 25లక్షల ప్రొసీడింగ్‌ను అందించారు. తన స్వగ్రామం రహత్‌నగర్ పక్కనగల లొద్ది రామన్న మందిరంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఇందల్వాయి వద్ద ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నాయకులు గంగారెడ్డి, జగదం సుమన్, సకినాల శివకుమార్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు.



రామాలయాన్ని దర్శించుకున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

తిర్మన్‌పల్లిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఇందల్వాయి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిర్మన్‌పల్లి ఎల్లమ్మగుడి దగ్గర గుర్తుతెలియని వ్యక్తి పడి ఉండటంతో చికిత్స నిమిత్తం పోలీసులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. మృతుడు వయస్సు సుమారు 70 సంవత్సరాలు ఉంటుందని తెలుపు చొక్కా, తెల్ల గడ్డం ఉందని మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఇందల్వాయి పోలీసులను సంప్రదించాలని కోరారు.

ద్విచక్ర వాహనం పైనుంచి పడి వ్యక్తి మృతి

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాగిర్యాల్ గ్రామ శివారులో ఆదివారం గండికోట మహేష్ (42) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుండి పడి తలకు తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మరణించినట్లు భీమ్‌గల్ ఎస్సై మహేష్ తెలిపారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బోధన్‌లో భారీ చోరీ



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బోధన్‌రూరల్, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో రెండు రోజుల క్రితం ఈశ్వర్ దాస్ తన భార్యతో కలిసి హైదరాబాద్‌లో తన కుమారుడి వద్దకు వెళ్లారని పట్టణ సీఐవెంకట నారాయణ పేర్కొన్నారు. 6వ తేదిన ఇంటికి పక్కన ఉండే అరుణ్ కుమార్ ఈశ్వర్‌దాస్‌కు ఫోన్ చేసి ఇంటి తాళాలు పగులగొట్టబడి ఉన్నాయని తెలుపగా ఈశ్వర్‌దాస్ హైదరాబాద్ నుంచి బోధన్ కు రాగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయని, బీరువాలోని ఒక కిలో వెండి ఆభరణాలు, తులం బంగారం ఆభరణాలు, 30వేల నగదు, సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్ దొంగిలించబడ్డాయని ఫిర్యాదులో బాధితుడు ఈశ్వర్‌దాస్ పేర్కొన్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఘటన స్థలాన్ని పరిశీలించామని సీసీఫుటేజీల ద్వారా అన్ని కోణాల్లో విచారణ చేపట్టి గుర్తుతెలియని దొంగలను పట్టుకుంటామని పేర్కొన్నారు.

సంస్కారభారతి ఇందోర్ నూతన కార్యవర్గం

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సంస్కారభారతి ఇందోర్ నూతన మహానగర కమిటీ ఆదివారం ఎన్నికయ్యారు. సంఘ కార్యాలయంలో జరిగిన కలల మధ్యభాగంగా పంచవర్ష కార్యక్రమాన్ని ప్రజల మధ్యకు తీసుకుపోవాలని ఆకాంక్షిస్తూ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా రాజ్‌కుమార్ సుబేదార్, ఉపాధ్యక్షులుగా సుముద్రాల శ్రీనివాసాచార్య, మోహన్‌రెడ్డి, మల్లేష్, జయప్రద, చిరంజీవాచారి, ప్రధాన కార్యదర్శిగా కార్తీక్, కార్యదర్శులుగా వినోద్, వరలక్ష్మి, రమాకాంతాచారి, నిలిషి, మాలినీ, సహ కార్యదర్శి, కోశాధికారిగా రాధాకృష్ణ, మాతృశక్తి కన్వీనర్ మాధురి, ప్రచార ప్రముఖ్ శ్రీకాంత్, కావిభాగ్ కన్వీనర్ రవికుమార్, దృశ్య కాలవిభాగ్ కన్వీనర్ నవీన్, లోపు కాలవిభాగ్ కన్వీనర్ ప్రశాంత్, సాహిత్య కాలవిభాగ్ కన్వీనర్ శ్రీమన్నారాయణాచారి విరాట్, కూచిపూడి విభాగ్ కన్వీనర్ పురుషోత్తమాచారిలు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కళ్యాణిరచన, రజిని, సాయిరెడ్డి, నాగమణి, రామ, శ్రీనివాస్‌రెడ్డి, సమద్రాల మధుసూదనాచారి ఎన్నికైనట్లు తెలిపారు.

ఘనంగా సాయిబాబా జయంతి

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సద్గురు సాయిబాబా జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సాయిబాబా ఆలయాల్లో విగ్రహానికి పంచామృత అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని జిల్లా కేంద్రంలోని సాయి సంతోషి ఆలయం, ముబారక్ నగర్ సాయిబాబా ఆలయం, తేనెసాయిబాబా ఆలయం, మాధవనగర్ సాయిబాబా ఆలయం, చేపూర్ సాయిబాబా ఆలయం, ఆలయాల్లో సాయిబాబా ఘనంగా పల్లకి రథ పూజ వేడుకలు సాగాయి.

కల్యాపూర్‌లో చలివేంద్రం ప్రారంభం

రెంజల్, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్యాపూర్ గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షులు నవీన్‌కుమార్, అఖిల్, రాజ్ కుమార్, మురళి, సంజీవ్, శివ, హరి, తేజ, అక్షయ్, అనూష్, పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ